విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
మంగళవారం 11, మార్చి, 2025

కేజీబీవీని విద్యార్థినిలకు పరీక్షా స్టేషనరీ ను పంపిణీ చేసిన ఎంపీపీ

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభ మండలంలో గల కేజీబీవీని సోమవారం స్థానిక ఎంపీపీ రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థినిలు అందరికీ కూడా పరీక్షా స్టేషనరీలను పంపిణీ చేశారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్న విద్యార్థినిలకు తగుచూచనలు సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థినిలను తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. విద్యార్థులు అందరూ కూడా ఎటువంటి భయం లేకుండా పరీక్ష రాయాలని, అనవసరమైన ఒత్తిడిలకు గురికా వద్దని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థినులకు ఆయన ఆల్ ద బెస్ట్ చెప్పారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-పెందుర్తి: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఎన్డీఏ నాయకులు ఎన్నికల సమయంలో పట్టణాల్లో రెండు సెంట్లు పల్లెల్లో మూడు సెంట్లు పేదలకు పంపిణీ చేస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ పార్టీ పెందుర్తి ఏరియా సమితి ఆధ్వర్యంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర నాయకులు జే.వి సత్యనారాయణ మూర్తి పేదలను కలిసి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న పేదల కష్టాలపై ఆవేదన వ్యక్తం చేసిన సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని, అలాగే స్థలాలు ఇచ్చిన వారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన టిడ్కో ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. అనంతరం ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వందలాది మంది పేదలతో కలిసి తహసీల్దారు కార్యాలయం ముఖద్వారం వద్ద నిరసన తెలిపారు. ఆ తర్వాత పేదలతో కలిసి ఇళ్ల దరఖాస్తులను తాసిల్దార్ ఆనంద్ కుమార్ కు అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సమితి సభ్యులు వై. రాంబాబు, కార్యదర్శులు ఎన్. అశిరినాయుడు, అన్నపూర్ణ, పార్టీ సభ్యులు రాము,రమణ, పరుశురాం, కె.రజనీ, అనురాధ, దుర్గారావు పెద్ద సంఖ్యలో పేదలు పాల్గొన్నారు.

ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

విశాలాంధ్ర-మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలోగల ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలు స్థానిక సిపిఐ పార్టీ నాయకుల ఆధర్యంలో ర్యాలీగా బయలుదేరి ఇంటి స్థలం కొరకు దరఖాస్తులు సోమవారం మొలగాడ తాసిల్దార్ భుజంగ రావు కి అందజేశారు. అర్హులైన పేదలచేత దరఖాస్తులు అందించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇచ్చిన అమలు చేయాలని అర్హులైన పేదలందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు స్థలము పట్టణాల్లో రెండు సెంట్లు స్థలము ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, సొంతగా ఇంటి నిర్మాణానిక ఐదు లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేయవలసిందిగా సిపిఐ పార్టీ ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వెంటనే అర్హులకు ఇల్లు ఇవ్వాలని సిపిఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది కార్యక్రమంలో సిపిఐ సీనియర్ కామ్రేడ్ నూనెల సూరిబాబు, సిపిఐ విశాఖ జిల్లా సమితి సభ్యుడు గండి అప్పారావు, సభ్యులు డి గోపి టి కామేశ్వరరావు బి వెంకట్ , ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా నాయకురాలు గుడాల జయ మరియు ఎస్ లక్ష్మి , జీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దువ్వపాలెంలో రామాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం వాలిమేరక పంచాయతీ దువ్వపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా సమేత కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులు పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. విగ్రహాలకు పూజలు చేసి అర్చకులు నుండి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు వాణి సూర్య ప్రకాష్, సీనియర్ నాయకులు సింహాద్రి అప్పలరాజు, సింహాద్రి దేవుడు బాబు, బాలాజీ, ఎర్ర సత్తిబాబు, కొనగంటి కనకరాజు, బొడ్డపిల్లి దేవుడు, నగేష్ ,సోమశేఖర్ నాయుడు, గోరపిల్లిసత్యారావు,వర్రి శివ తదితర ఎన్డీఏ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

సింహాద్రి నాధుని దర్శించుకున్న పీలా కుటుంబం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ పూల మాల వేసి ఘన స్వాగతం పలికారు. వారు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, బేడ మండపం ప్రదక్షణ చేసారు. పిదప తమ గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు సంకల్పం చెప్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఏఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆలయ పర్యవేక్షణ అధికారి త్రిమూర్తులు ఉన్నారు.

శ్రీ పెంటమాంబ ఆలయ త్రిముఖ ద్వారాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర -పెదగంట్యాద: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ, నిర్వాసితుల కాలని ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పెంటమాంబ ఆలయ ముఖ ద్వారాలకు సోమవారం గ్రామ పెద్దలు, భక్తులు సంఖు స్థాపన చేశారు. ఏప్రిల్ నెలలో వచ్చే అమ్మవారి పండుగ సందర్భంగా భక్తులందరికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించాలన్న ఉద్దేశ్యం తో ఉత్తర, దక్షిణ ద్వారాలు ఏర్పాటు చేయుటకు ఆలయ కమిటీ గ్రామ పెద్దలు సిద్ధం అయ్యారు. ఈ సందర్భంగా పెద్దలు గోందేశీ మహేశ్వర రెడ్డి, పులి రమణ రెడ్డిలు మాట్లాడుతు ఉగాది పండుగ నుండి అమ్మవారి పండుగ మొదలుఅవుతుందని, ఇలోగా అనకాపల్లి నూకాలమ్మ తల్లి ఆలయంలో గల త్రిముఖ ద్వారాలు ఏర్పాటు చేసి భక్తుల రద్దిని తగ్గిం చేందుకు కృషిచేస్తామన్నారు. గోందేశీ అప్పలరెడ్డి సత్యారావు, యేల్లేటి శ్రీనివాసరావు, పిట్ట కుంచరావు లు మాట్లాడుతు ఏప్రిల్ 14 న శ్రీ పెంటమాంబ అమ్మవారి పండుగ, 15 న శ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగలు ఏర్పాట్లలో భాగంగా ఈ అభివృద్ధి కార్యక్రమలు చేపట్టామ న్నారు. దీనికి సంబందించి ద్వారాబంధాలు, తలుపులుకు విరాళాలు అందజేసిన దాతలుకు కృతజ్ఞతలు తెలియజేసారు. శ్రీ పెంటమాంబ అమ్మవారి వార్సీకోత్సవం సందర్భంగా భక్తులు, నిర్వశిత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున విరాళలు అందజేసి అమ్మవారి అనుగ్రహనికి పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఆలయ పూజారి సుబ్రహ్మణ్య శర్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, దొడ్డి పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై నరవ గ్రామస్తుల ఆందోళన

విశాలాంధ్ర-పెందుర్తి/గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు, పెద నరవ గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటుచేసి గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకో వాలని నిర్ణయించారు. జనసేన పార్టీ 88 వార్డు అధ్యక్షులు వబ్బిన జనార్ధన శ్రీకాంత్, జనసేన నాయకులు గల్ల శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు గవర సత్తిబాబు, ఇల్లపు శ్రీను, టిడిపి వార్డు అధ్యక్షులు గంతకోరు శివకుమార్, మాజీ సర్పంచ్ గవర సంజీవరావు, వైఎస్ఆర్సిపి వార్డు ఇంచార్జ్ గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, సహా యువత, ప్రజలు పాల్గొని అడ్డు అదుపు లేకుండా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలతో గ్రామానికి జరుగుతున్న నష్టాలను వివరించారు. గత కొన్ని సంవత్సరాలు నుండి నరవ గ్రామంలో అక్రమ క్వారీలు జరపడం వల్ల ప్రభుత్వ భూమిని నష్టపోతున్నామని, పర్యావరణం కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో నచ్చిన చోటల్లా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతూ పెద్ద పెద్ద గోతులు పెడుతున్నారని దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వెలిబుచ్చారు. భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా అభివృద్ధి చేయడానికి ఆ భూములు పనికి రాకుండా పోతున్నాయని, ప్రభుత్వం గ్రావెల్ తవ్వడానికి లైసెన్స్ ఇవ్వక పోవడం వల్ల వాటిపై ఆధారపడిన యజమానులు ఇటువంటి పనులు చేస్తున్నారని వెల్లడించారు. గృహ నిర్మాణాలకు గ్రావెల్ కోసం స్థానికులు యజమానుల చేత అక్రమంగా గ్రావెల్ ను వేయించుకుంటున్నారని, ఈ విధంగా చేయడం వల్ల అటు ప్రభుత్వానికి, మన నరవ గ్రామం అభివృద్ధి కూడా చాలా నష్టం చేకూరుతుందని, ప్రతి సమస్యకి ఒక పరిష్కారం ఉంటుందని చర్చల ద్వారా పరిష్కార మార్గాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇకపై నర్వలో అందరం గ్రామపకాలను అడ్డుకోవాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

గీతంలో "ప్రయాస్ " కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర -మధురవాడ: సైన్స్ కోర్సులు అభ్యసించే విద్యార్థులలో నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచడంతో పాటు స్ఫూర్తిని కలిగించడానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో "ప్రయాస్ " పేరిట సరికొత్త కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ మాట్లాడుతూ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులు ప్రతి అంశాన్ని పరిశోధన దృష్టితో చూడాలని, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రయాస్ కార్యక్రమంలో భాగంగా రసాయన శాస్త్ర విభాగం నిర్వహించిన ప్రసంగ కార్యక్రమంలో ప్రఖ్యాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజి (ఐఐసిటి-హైదరాబాద్) శాస్త్రవేత్త ప్రొఫెసర్ వి. జయతీర్థరావు మాట్లాడుతూ హృద్రోగ సంబంధమైన సమస్యలపై తాము గత 30 సంవత్సరాలుగా పరిశోధనలు జరుపుతున్నామని తెలిపారు. ఫాస్ఫోడిస్టైరెజ్ 3 (పిడిఇ-3) ద్వారా ప్రస్తుతం వినియోగిస్తున్న గుండె పోటు మరియు ఇతర సమస్యలకు మరింత మెరుగైన చికిత్స అందించవచ్చునని తెలిపారు. జర్మనీ శాస్త్రవేత్తలతో తాము జరిపిన పరిశోధనలు విజయవంతం అయ్యాయని వెల్లడించారు. పిడిఇ-3 వాడకం వల్ల హృద్రోగులలో స్టంట్‌లు వేయవలసిన అవసరం ఉండదన్నారు. అయితే దీనికి సంబంధించి జంతువులపై జరిపిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సైడ్ ఎఫెక్ట్‌ల పై ప్రస్తుతం క్లీనికల్ పరీక్షలు జరుపుతున్నారని ఆయన తెలియజేశారు. విద్యార్థులు ప్రాచీన ఆయుర్వేద విజ్ఞానంపై సహితం పరిశోధనలు జరిపి సరికొత్త ఔషధాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్ పథకాన్ని దీనికి ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జివియంసి కమిషనర్ ను వెంటనే నియమించాలి

సిపిఐ, సిపిఎం కార్పొరేటర్ల నిరసన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జివియంసి కమిషనరును తక్షణమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ, సిపిఎం కార్పొరేటర్లు ఏజే స్టాలిన్, డాక్టర్ బి.గంగారావు, జివియంసి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలల నుండి జివియంసికి కమిషనర్ లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డాక్టర్ సంపత్ కుమార్ ను కమిషనర్ నియమించి ఐదు నెలలు గడవకముందే బదిలీ చేసారన్నారు. అప్పటి నుండి కమిషనర్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా భావించారు. రాష్ట్రంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ జివియంసి సుమారు 25 లక్షల మంది ప్రజలు ఉన్నారు. కమిషనర్ లేకపోవడంతో ప్రజా సమస్యలు ముఖ్యంగా మంచినీరు, పారిశుద్ధ్యం , విద్యుత్, రోడ్లు తదితర అనేక సమస్యలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. జనవరిలో ఆమోదించాల్సిన జివియంసి బడ్జెట్ ఇప్పటికి కూడా ఆమోదించక పోవడంతో సుమారు 8వేలమంది కార్మికుల వేతనాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. అంతేకాకుండా నగరంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి కార్యక్రమాలు అన్ని కుంటుపడ్డాయని , కార్పొరేటర్లు డమ్మీగా మార్చేశారన్నారు. జివియంసి పూర్తిగా ఎమ్మెల్యేల చేతుల్లో పెట్టారని, రాష్ట్ర కూటమి ప్రభుత్వంలో ఉన్న అనైక్యత వల్ల, మూడు పార్టీల ఆధి పత్య రాజకీయ పోరుతో జివియంసి కి మున్సిపల్ కమిషనర్ ను నియమించకుండా 25 లక్షల ప్రజల ప్రయోజనాన్ని, సంక్షేమాన్ని, నగర అభివృద్ధిని దెబ్బతీయటం సరైనది కాదన్నారు. మేయర్ మార్పే దానిమీద ఉన్న శ్రద్ధ కమిషనర్ ను నియమించే దాని మీద రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం చాలా సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జివియంసి కమిషనర్ ని నియమించాలని హెచ్చరించారు. లేనియెడల ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

మహిళలకు స్ఫూర్తి సావిత్రీబాయి పూలే ....

విశాలాంధ్ర-మల్కాపురం: సావిత్రి బాయి పూలే బాల్యవివాహాలకు, సతీ సహగ మనానికి, అంటరానితనానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకం గా పోరాడారని, స్త్రీ విద్యకు, వితంతు పునర్వివాహాలకు అనుకూలంగా ఉద్యమించారని, ఆమె మహిళలందరికీ స్ఫూర్తి దాయకం అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.వి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సావిత్రి బాయి పూలే వర్ధంతి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ- సావిత్రిబాయి పూలే భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని అని అన్నారు. జ్యోతిబాపూలేతో కలిసి 18 స్కూళ్లను స్థాపించి స్త్రీ విద్యకు ఎంతో కృషి చేశారని అన్నారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి మాట్లాడుతూ - సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త అని, ప్లేగు వ్యాధితో బాధ పడుతున్న భారత ప్రజలకు సేవ చేసి చివరకు ఆ ప్లేగు వ్యాధితోనే ఆమె మరణించారని అన్నారు. ఆమె పేరును పూనే విశ్వవిద్యాలయానికి పెట్టడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం కార్యకర్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం జ్యోతిబాపూలే జీవిత చరిత్రపై మరియు ఆమె సేవలపై క్విజ్ పోటీని నిర్వహించారు. సమావేశాన్ని నిర్వహించిన వారిని, విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

అర్జీలు పునరావృతం కాకుండా బాధ్యతగా తీసుకోవాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్" లో వచ్చిన అర్జీలను 24 గంటల లోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయి లో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు.... జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎమ్‌సి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారు లను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం...

లిప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ నకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రీ-ఓపెన్ అర్జీలు తరచుగా రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న అర్జీలపై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి, ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీపం పథకం అమలు మరియు లబ్ధిదారుల యొక్క ఖాతాలకు సబ్సిడీ అందుతున్నది లేనిది గమనించాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేజీహెచ్ లో రోగులకు సంబంధించి అవసరమైన పరీక్షలను నిర్వహించాలని, వివిధ రకాల స్కానింగ్ లు పరీక్షల నిమిత్తం రోగులను బయటకు పంపకూడదని, అవసరమైన మందులను పంపిణీ చేయాలని సంబంధిత వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 332 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 131 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 24, జీవీఎంసీ సంబంధించి 111 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 66 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు

బీసీల డిమాండ్స్ సాధనకై మార్చి 12, 13 న చలో ఢిల్లీ

ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: బీసీల న్యాయమైన డిమాండ్స్ సాధన కోసం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు భోగి రమణ పిలుపునిచ్చారు. జాతీయ బీసి సంక్షేమ సంఘం, ఏపీ బి.సి. సంఘం సంయుక్త ఆధ్వర్యలో బీసిల డిమాండ్స్ కోసం ఈ నెల 12, 13 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు ప్రకటించారు. డాబాగార్డెన్స్ లోని విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో చలో ఢిల్లీ పోస్టర్ ను బీసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భోగి రమణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఓబీసీ లకు 50శాతం రాజకీయ రిజర్వే షన్ కల్పించాలని, బీసీ మహిళల కు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పెట్టాలన్నారు. కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ బీసీలకు పెద్ద పీట వేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ బీసీల పట్ల వారి డిమాండ్స్ పట్ల సానుకూలంగా వున్నారన్నారు. బీసీ ఉద్యమ నేత పితాని ప్రసాద్ మాట్లాడుతూ బీసీ డిమాండ్స్ పై న్యూఢిల్లీలో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ బిసిసంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు మార్చి 12న ఢిల్లీలోని ఆంధ్రా భవన్లో బీసీ మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం, రెండో రోజున బీసీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై సదస్సు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. వీటితో పాటు బీసీ జనగణన, చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలి విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ సభ్యులు జి ఎ నారాయణరావు మాట్లాడుతూ భోగి రమణ బీసీ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఆర్థికాభివృద్ధి సాధించి నప్పుడే బీసీలు అభివృద్ధి సాధించినట్టు అని పేర్కొన్నారు. బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. బీసీల ఆశలు, అశయాలు అక్కడే చచ్చిపోతు న్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. వావిలపల్లి శ్యామ్ సుందర్ నాయుడు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ చేసిన పాపాలు విద్యార్థుల పాలిట శాపాలుగా మారాయి ...!

విఎంఆర్‌డిఏ చైర్‌పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర-విశాఖ: రాష్ట్రానికి కంస మామలా జగన్ చేసిన పాపాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయని వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎం వి ప్రణవ్ గోపాల్ విమర్శించారు. మాజీ సిఎం వై.ఎస్.ఆర్. పేరు చెప్పుకొని గద్దె నెక్కి బోధనా రుసుములు చెల్లింపును అటకెక్కించిన ఘనుడు జగన్ అని అన్నారు. ఇప్పుడు ఫీజు పోరు అంటూ కొత్త నాటకాలు, పగటి వేషాలు వేస్తే జనం చూస్తూ ఊరుకోరన్నారు. విద్యా శాఖా మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకున్న వెంటనే సుమారు రూ. 800 కోట్లు బోధనా రుసుముల కోసమే కేటాయించారన్నారు. లి అది కూడా తెలియకుండా పోరు, హోరు అంటే జనం చూస్తూ ఊరుకోరు-జాగ్రత్త జగన్. జగన్ పై ఉన్న కేసులు విచా రించాలని ప్రజలు పోరు బాట పట్టే రోజు తొందరలోనే ఉందన్నారు. ప్రతీ ఏటా జాబ్ కేలండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేసి, ఇప్పుడు యువ పోరు అంటే నమ్మేవారు లేరన్నారు.

ప్రజా దర్బార్ వినతులను గడువులోగా పరిష్కారించాలి

వీఎంఆర్‌డిఏ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాధన్

విశాలాంధ్ర-విశాఖ: విఎంఆర్‌డిఏ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు వచ్చిన ఫిర్యాదులు, వినతులను గడువులోగా పరిష్కరించాలని చైర్ పర్సన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ కె ఎస్ విశ్వనాధన్ లు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వ హించిన ప్రజా దర్బార్ కి పులువురు వినతులు అందజేశారు. ఎక్కువగా ప్రైవేట్ లే అవుట్ లకి చెందిన ప్లాట్‌ల విషయంలో ఫిర్యాదులు వస్తున్నా యని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదిదారులు రెండోసారి రాకుండా, చూడాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ కి సంబంధించి పలువురు ఫిర్యాదులు చేశారు. వాటిని త్వరలో పరిశీలిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్ కి మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 4 పరిపాలన, 11 ప్లానింగ్, 1 రెవెన్యూ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జేసీ కే రమేష్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కు అంతరాయం

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం మంగళవారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ఆనందపురం పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పొడుగుపాలెం,చందక ,గొట్టిపల్లి వెంకటాపురం, కుసులువాడ తదితర ప్రాంతాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించాలని తెలిపారు.

రసాయన రహిత కూరగాయల ప్రదర్శన

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక మహిళా మండల సమాఖ్య కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన రసాయన రహిత కూరగాయలను సిబ్బంది ప్రదర్శన పెట్టారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలు, పువ్వులు, ఆకుకూరలను స్థానికులకు విక్రయించారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలు తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ ఎం ఉమారాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది షణ్ముఖ,బాలకృష్ణ, అశోక్ ఉన్నారు.

వైసిపి నాయకుల భూదాహం...

- ల్యాండ్ పోలింగ్ లో సుమారు 40 ఎకరాల కుంభకోణం - చెరువును చూపించి కోటి నష్టపరిహారం
- సుమారు రూ.15 కోట్లు విలువచేసే 10,350 గజాల ప్రభుత్వ భూమి.. వైసిపి అనుచరులకు పట్టాలు
- 134 వైఎస్సార్ కాలనీ ఇళ్లలో స్థానికులు చేరినవి కేవలం 50 మాత్రమే
- పేదవారికి సెంటు స్థలం లేదు.. ఉప సర్పంచ్ కు మాత్రం 8 సెంట్లు, ప్రభుత్వ స్థలంలో డూప్లెక్స్ ఇల్లు
- సమావేశంలో కూటమి నాయకుల ఆరోపణ

విశాలాంధ్ర-గోపాలపట్నం: గత వైయస్సార్సీపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం లో ప్రధాన నాయకులే కాకుండా దిగువ స్థాయిలో కార్యకర్తల అనుచరులుకు కూడా భూదాహానికి అడ్డు అదుపు లేకుండా తారస్థాయికి చేరుకున్నాయి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం జెర్రీపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం కూటమి నాయకులు గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను భూ దోపిడీలను ప్రజలకు జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు రాష్ట్ర నాయకులకు తెలియజేసేందుకు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ మడక అప్పలరాజు మాట్లాడుతూ.. జర్రిపోతులపాలెం వైయస్సార్ కాలనీలో సుమారు 134 ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వగా అందులో అర్హులు స్థానిక గ్రామస్తులు 50 మంది మాత్రమే ఉన్నారు మిగిలినవన్నీ వైఎస్ఆర్సిపి నాయకులు అనుచరులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారన్నారు 170 ఇల్లు నిర్మించగా అందులో 40 లబ్ధిదారులు మాత్రమే అర్హులని మిగిలిన వన్నీ అనర్హులకి కేటాయించి కోట్లలో వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు అలాగే సర్వే నంబరు 420 చెరువు కాగా దానికి కూడా పాస్ పుస్తకాలు తయారు చేయించుకుని ఆ చెరువు మీదగా ఎన్ హెచ్ 5 రహదారి వస్తే నేషనల్ హైవే అథారిటీ వారి వద్ద నష్టపరిహారం కింద కోటి రూపాయలు కాజేశారు మా గ్రామానికి ప్రధానమైన సమస్య ల్యాండ్ పోలింగ్ మా గ్రామ రైతుల పూర్తిగా మేలాద్రిగడ్డ రిజర్వాయర్కు భూమిని ఇచ్చేశారు ఆ రైతులకు మిగిలింది కేవలం ఎటువంటి వ్యవసాయానికి నోచుకోని కొండ ప్రాంతం మాత్రమే అది కూడా ల్యాండ్ పోలింగ్ పేరుతో గ్రామస్తులు వద్ద సుమారు 100 ఎకరాలు భూమిని గత ప్రభుత్వం తీసుకుంది గ్రామస్తులకు లబ్ధిదారులకు మాత్రం ఎటువంటి లబ్ధి చేకూరలేదు కానీ వైసీపీ నాయకులకు అనుచరులకు మాత్రం మంచి లాభం చేకూరింది అది ఎలా అంటారా 100 ఎకరాలలో సుమారు 40 ఎకరాల భూమి కుంభకోణం జరిగింది ప్రస్తుతం మార్కెట్ ధర సుమారు 40 నుండి 50 కోట్ల రూపాయలు భూమి వైసీపీ నాయకులు అనుచరులు కలిసి బినామీ పేర్లతో కాజేశారు అన్నారు. దోచుకో - దాచుకో అనే రీతులు గత ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా ప్రవర్తించింది రూరల్ హౌసింగ్ కాలనీలో జెర్రిపోతుల పాలెం లో తమ్ముడికి పట్టా,భార్యకి పట్టా, బావమరిదికి పట్టా ఇంటి యజమాని పేరును మాత్రం ఇంటి పని ఉంటుంది ఎలా సుమారు పదుల సంఖ్యలో బినామీ పేర్లతో అడ్డగోలుగా ఇళ్ల స్థలాలను దోచేశారు స్థానిక వైసిపి నాయకులు అలా బినామీ పేర్లతో పట్టాలు చేయించి అమ్ముకొని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు అందులో కొంతమంది అధికారులకు కూడా వాటా లేకపోలేదు అదే విధంగా ల్యాండ్ పోలింగ్లో డీ పట్టా ఉన్న రైతులకు ఒక ఎకరాకు 900 గజాలు గత ప్రభుత్వం పట్టా తయారుచేసింది పట్టా లేకుండా అనాధికారికంగా ఉన్న రైతుకు ఎకరాకు 400 గజాలు ప్రకటించింది ఇదే అదనిగా భావించిన ఎసిపి నాయకులు వారి వారి బినామీ పేర్లపై సుమారుగా మొత్తం 10,350 గజాల స్థలానికి పట్టాల తయారు చేసేసారు నిలువలు నీడలేని పేదవాడికి 60 గజాలు ఇల్లు కూడా లేదు కానీ రెండు మూడు ఇల్లు ఉన్న వారికి మాత్రం పట్టాలు ఎలా మంజూరు చేశారు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి గతంలో తీసుకెళ్లాము సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఆ పట్టాలను వెంటనే రద్దు చేస్తామని హామీ ఇచ్చారు ఇంతటి అన్యాయం వైయస్ఆర్సీపీ చేసింది కాబట్టే గడిచిన ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైంది రానున్న రోజుల్లో ఒక్క సీటుకు మాత్రమే పరిమితమైపోతుంది ప్రజలన్నీ గమనిస్తూ ఉన్నారు పేద ప్రజలు రైతుల కన్నీరు ఎవరిని వదిలిపెట్టదన్నారు జనసేన నాయకులు గళ్ళ శ్రీనివాస్.. చింతగట్ల పంచాయతీ సర్వేనెంబర్ 16 లో కొన్ని ప్లాట్లు విప్లవానిపాలెం సర్వే నంబర్ 81/2 లో సుమారు 135 ప్లాట్లు గత ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నాయకులు వేశారు అందులోనూ ఏడు ప్లాట్లు బినామీలే, మిగిలిన 9 ప్లాట్లు కూడా లక్షల రూపాయలకి ఒక్కో ఫ్లాట్ అమ్ముకున్నారు ఇంతటి భూకంపం కోణాలు కేవలం నాయకులే చేశారా లేదా అధికారులు కూడా ఇందులో భాగస్వాముల అనే అనుమానం కలుగుతుంది ఎందుకంటే మండల రెవెన్యూ అధికారులను సమాచార హక్కులు చట్టం ద్వారా మరియు సరైన వివరములు కొరకు అధికారులను సంప్రదించగా వారి నుండి సరైన సమాధానం గాని సమాచారం గాని నేటి వరకు రాలేదు రేపు ఇస్తాం మ్యాపిస్తం అంటూ కాలేపం చేస్తూ వస్తున్నారు స్థానిక విఆర్వో అని అడిగితే సర్వేయర్ పైన , సర్వేయర్ ను అడిగితే తాసిల్దార్ పైన కుంటి సాగులు చెబుతూ కాలం గడిపేస్తున్నారు ఎవరు ఎంతటి ప్రయత్నాలు చేసినా ఇంతటి ప్రజాధనాన్ని కుంభకోణం చేసిన ఎవరిని కోటమి ప్రభుత్వం స్థానిక ఓటమి నాయకులు వదిలిపెట్టేది లేదన్నారు ఇప్పిలి చిన్నారావు. కనుక ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా కలెక్టర్ స్పందించి మా పంచాయతీలో జరిగిన వైఎస్ఆర్ కాలనీలో ల్యాండ్ పోలింగ్లో జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ జరిపి బినామీ పేర్లతో తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాలు తయారు చేయించి కోట్ల రూపాయలకు ప్రభుత్వ ఆస్తులని, అమ్మి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు గ్రామ ప్రజలు పెద్దలు కోరుతున్నారు కార్యక్రమంలో ఇల్లపు శ్రీనివాస్, శివ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా పట్టణాల అభివృద్ధి జరగాలి

గీతం సదస్సులో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా

విశాలాంధ్ర-మధురవాడ: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు పట్టణాలకు వలస రావడంతో పట్టణ జనాభా క్రమంగా పెరుగుతోందని 2060 నాటికి భారతదేశంలో సహితం 70 శాతం ప్రజలు పట్టణాలలో నివశించే పరిస్థితి ఏర్పడబోతోందని ఈ కారణంగా ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా పట్టణాల అభివృద్ధి జరగాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో సోమవారం తేది:10-03-2025న నిర్వహించిన "కంపాసినేట్ సిటీస్" సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. దేశంలో పట్టణ జనాభా పెరుగుతున్నప్పటికి ఆర్ధిక వనరులు సరిపడా లేకపోవడంతో సరైన సదుపాయాలు లేకుండానే పట్టణాలు విస్తరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పట్టణాలు వ్యాపార కేంద్రాలుగా ఆర్ధిక ప్రగతిలో కీలక పాత్ర పోషించనున్నాయని అయితే అక్కడి ప్రజల ఆరోగ్యం, రవాణా, విద్యా సధుపాయాల పై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ డాక్టర్ విభూతి సచ్చదేవ్, విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు సోహన్ హట్టంగడి తమ ప్రసంగాలలో విశాఖ వంటి పట్టణాలను అభివృద్ధి చేసే క్రమంలో పర్యావరణ అంశాలు, ప్రాచీన వారసత్వ కట్టడాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవి మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ డైరక్టర్ సుజీత్కుమార్ డోంగ్రే తన ప్రసంగంలో తీర ప్రాంత పరిరక్షణ అంశాల ప్రాధాన్యతను వివరించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ వి.రబీంద్ర మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో హెరిటేజ్ మేనేజ్మెంట్ ప్రణాళిక అంతర్భాగంగా ఉండాలని సూచించారు. ఇన్క్యూబిస్ వ్యవస్థాపకుడు అమిత్ కృష్ణగులాటి విశాఖలోని ప్రాచీన వారసత్వ కట్టడాలను పరిరక్షించుకునే పద్దతులను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ రేణుకా రాణి, ధాన్ ఫౌండేషన్ పర్యావరణ ఇంజనీర్ ఎస్.లోకేష్, పూర్ణమిదమ్ సంస్థ వ్యవస్థాపకురాలు కావ్యా పూర్ణిమా, ప్రముఖ ఆర్కిటెక్ట్ హర్షగోయల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

యువత పోరు గోడపత్రికను ఆవిష్కరించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-పెందుర్తి : మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మార్చి 12న వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను రాంపురం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఉదయం ఆవిష్కరించారు. పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అన్నంరెడ్డి అదీప్ రాజ్, రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చిన్నఅప్పలనాయుడు, గండి రవికుమార్, పినగడి గ్రామ సర్పంచ్ బైలపూడి భగవాన్ జయరాం, సబ్బవరం ఎంపీపీ బోకం సూర్య కుమారి రాము నాయుడు, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను , జీవీఎంసీ 97 వార్డు అధ్యక్షులు మెంటి మహేష్, 95 వార్డు రాపేటి మాధవరావు, తామర్ల నర్సింగరావు, గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు , దాడి నూకరాజు, కొటాన రాము, ధనిమిరెడ్డ్ శ్రీను, జాబ్ దాస్ (చిన్ని) , గుర్రంపాలెం సర్పంచ్ ఉగ్గిన గోవింద్, మల్లు నాయుడుపాలెం సర్పంచ్ బోని నాయుడు, మహేష్ , గొల్లవిల్లి వాసు, నియోజవర్గ వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ హయాంలో ఉన్నత విద్యను అందించి పథకాలు అమలు చేసామని, కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందని విమర్శించారు.

లీ అసోసియేట్స్ కి పిసిపిఐఆర్ మాస్టర్ ప్లాన్ బాధ్యత

విశాలాంధ్ర-విశాఖ: విశాఖపట్నం - కాకినాడ పెట్రోల్ కెమికల్ పెట్రోలియం ఇన్వెస్టిమెంట్ (వీకే పిసిపిఐఆర్) మాస్టర్ ప్లాన్ రూపకల్పన బాధ్యతను లీ అసోసియేట్స్ కి అప్పగించామని వీకే పిసిపిఐఆర్ డెవలప్ మెంట్ అథారిటీ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీకే పీసీపీఐఆర్ ప్రాంతంలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు తీసుకుంటామని, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మాస్టర్ ప్లాన్ ముసాయిదాను ప్రభుత్వానికి ఆమోదం నిమిత్తం పంపుతామన్నారు.

వైభవోపేతంగా శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం పునః ప్రతిష్టా మహోత్సవం

శాస్త్రోక్తంగా యంత్ర విగ్రహ పూర్ణకలశ ప్రతిష్ఠ, విగ్రహ ఆవిష్కరణ, ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, అమ్మవారి దర్శనం

విశాలాంధ్ర-కొమ్మాది: విశాఖ నగరంలోని మధురవాడ ,మిధిలాపురి ఉడా కోలని ,బింద్రానగర్,షిప్ యార్డు లే అవుట్ లో అత్యంత వైభవోపేతంగా శ్రీ విజయగణపతి, ఏకశిల నాగాభరణ, శివలింగము,శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ సంతాన నాగేంద్ర స్వామి, శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునః ప్రతిష్టా మహోత్సవాన్ని నిర్వహించారు.. ఈనెల 7వ తేదీ నుండి శ్రీ నూకంబిక అమ్మవారి ఆలయ సమూహ వన ప్రతిష్ఠ మహోత్సవములను బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామ శర్మ,బ్రహ్మశ్రీ ఇప్పిలి సాయికిరణ్ శర్మ,బ్రహ్మశ్రీ అర్జింగి జగదీశ్వర్ ల పర్యవేక్షణ, నిర్వహణలో బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామ శర్మగారి ఆధ్వర్యములో 12 మంది వేద పండితులతో పునః ప్రతిష్టా మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే.. అందులో భాగంగా .సోమవారం సుప్రభాతసేవ, వేదపారాయణ, దీక్షాదారులచే యంత్ర విగ్రహ పూర్ణకలశ ప్రతిష్ఠ, విగ్రహ ఆవిష్కరణ, ప్రాణ ప్రతిష్ఠ , మహా పూర్ణాహుతి, అమ్మవారి దర్శనం, అవబృత స్నానం,వేద ఆశీర్వచనం, పండిత సత్కారం జరిపారు . మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధ జరిపారు. సాయంత్రం 5 లకు తిరుపతి వాస్తవ్యులు డాక్టర్ మల్లంపల్లి భద్రకాళీ చే "దేవి వైభవము" ప్రవచన కార్యక్రమము తదుపరి సాంస్కృత కార్యక్రమము పిల్లలచే నిర్వహించారు.. ఈ మహోత్సవ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తుల పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించినట్లు శ్రీ నూకంబిక ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం కస్తూర్బా బాలిక విద్యాలయం గిడిజాల జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో లో యువ నాయకులు కోరాడ వైకుంఠం , వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులుకాకర సురేష్ కుమార్ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత శ్రీ ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ . ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చింత వాసు నాయుడు సమక్షంలో 120 మంది 10వ తరగతి విద్యార్థి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. విద్యార్థి విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాసి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వృక్షా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకర్ సురేష్ కుమార్ యువ నాయకులు కోరాడ వైకుంఠం కొనియాడారు ముఖ్య అతిథులుగా వచ్చిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చింత వాసు నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడుతూనే మంచి ఫలితాలు సాధించగలరని ఉన్నత శిఖరాలు చేరుకోగలరని అన్నారు. మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే వారి ఉన్నత చదువులకు ఎల్లప్పుడూ నేను ఆర్థిక సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ మేడం సత్య లావణ్య . ఎస్ఎంసి చైర్మన్ కోరుకొండ శివాజీ. వైస్ చైర్మన్ ఓ అప్పన్న . కో ఆప్షన్ నెంబర్ మేము సైతం వ్యవస్థాపక అధ్యక్షులుఏ.దేవుడు బాబు . ప్రజా సంకల్ప వేదిక స్టేట్ గ్రీవెన్స్ వైస్ ప్రెసిడెంట్. బి .బంగార్రాజు . యువ నాయకులు బమ్మిడి తారక్ , షిణగం వెంకట్రావు, షిణగం ఈశ్వరరావు , కోరాడ అప్పల రమణ ,మీసాల అప్పలరాజు, షిణగం సన్యాసిరావు ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ శశి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రత అనేది ప్రతి వ్యక్తి ప్రథమ కర్తవ్యం

విశాలాంధ్ర-కొమ్మాది: భద్రత అనేది ప్రతి వ్యక్తి ప్రథమ కర్తవ్యం అని భద్రత లేని నాడు మిగిలేది శోకమే అని చంద్రపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నారు. జిందాల్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 54వ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం పాఠశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భద్రత రోడ్డు భద్రత ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరికి ముఖ్యమని తప్పనిసరిగా వాటిని పాటించిన నాడే మునుగడ సాగుతుందని లేకపోతే ప్రమాదాలు కోరి తెచ్చుకున్నట్లు అవుతుందని అన్నారు. జిందాల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఇన్చార్జ్ సతీష్ మాట్లాడుతూ తమ కంపెనీ విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలో ఉత్పత్తి అయిన చెత్త నుండి విద్యుత్తు తయారు చేస్తున్నా మని దానిని తిరిగి ప్రభుత్వం ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో వ్యాసరచన పోటీలలో మరియు భద్రత నినాదాలు పోటీలో గెలుపొందిన 18 మంది విద్యార్థులకు విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిందాల్ ప్లాంట్ ప్రతినిధి వేణు, ఉపాధ్యాయులు లక్ష్మి, హేమ తదితరులు పాల్గొన్నారు.

వేదమంత్రాల తో మార్మోగిన శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి

- ఆలయ ప్రాంగణం.. మహాశివ, వెంకటేశ్వర, వారాహిమాత ల ఆలయాల శంకుస్థాపన
- ముఖ్య అతిధులుగా 5, 7వార్డుల కార్పొరేటర్లు

విశాలాంధ్ర-మధురవాడ : కార్పెంటర్ కోలనీలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణం వేదమంత్రాలతో మారుమ్రోగా మహాశివ, వెంకటేశ్వ రస్వామి, వారాహి మాత ఆలయాల శంకుస్థాపన కార్యక్రమం భక్త జనరంజకం గా సోమవారం ఉ. 9.గం. 21 నిమిషాలకు వేద పండితుల ఆధ్వర్యంలోఆ ఆలయ సేవాసంఘం వారు ఘనంగా నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 5,7వ వార్డుల కార్పొరేటర్లు మొల్లిహేమలత, పిల్లా మంగమ్మ. టిడిపి సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు,పిల్లా వెంకట రావు, దాసరి శ్రీనివాస్,పైడా కృష్ణ ప్రసాద్, రమా దంపతులు, కంకటాల మల్లికార్జునరావు, గ్రంధి మల్లికా మనోజ్, గ్రంధి సురేష్, కేఎన్వీఎస్ గురుమూర్తి(శేషుబాబు).ఎ.నగేష్, పీవీ నరసింహారావు,శోభన్ ప్రకాష్, నాగుల శ్రీనివాస్(లివింగ్ లైన్స్ అధినేత),గ్రంధి రాజేష్, గ్రంధి రామ్జీ తదితరులు పాల్గొన్నారు. వారి స్వహస్తాలతో వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమాలు, సౌర,అరుణ, మంత్రాహనాలు, ఆదివాస హవనములు,సూర్య నమస్కారములు,అష్టబంధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి ఆధునిక దైనందిక జీవితంలో భగవంతుని ఆరాధన ఎంతోఅవసరమని, దైవ ఆరాధన, చింతనతో మనసుకు ప్రశాంతత తో పాటు ముక్తిచేకూరు తుందని, కార్యక్రమంలో పాల్గొనడం తమ పూర్వజన్మ అదృష్టమని పేర్కొన్నారు. ఆలయ ప్రతినిధులు వేటూరి.వెంకటేశ్వరులు (వెంకటేశ్వర విద్యాసంస్థల అధినేత),పొట్టా జగదీష్, కే లక్ష్మీనారాయణ,ఎస్ బాబురావు,జి రమా కామేశ్వరి.. వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం ఆలయప్రాంగణం లో నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్యకర్తలే పార్టీకి పునాది..

వైసీపీ సమన్వయకర్త మజ్జి చిన్న శ్రీను

- నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటా
- పార్టీ నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటా
- వైసిపి పార్టీ అభివృద్ధికి కలసి పనిచేద్దాం

విశాలాంధ్ర-ఆనందపురం: వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి చిన్న శ్రీనువాసరావు పేర్కొన్నారు. మండలంలోని గుడిలోవ లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు ఏం కావాలో గుర్తుండిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానన్నారు. మీ అందరికీ సేవకుడిగా ఉంటానని మీ అందరి సహకారాలు అందించాలన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు జరిగిన మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల ఇష్టం మేరకు సలహాలు మేరకే ప్రజలలో కార్యకర్తకు గౌరవం దక్కేలా పాలను సాగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శాసనసభ్యులు ప్రత్యక్షంగా ప్రజల వద్దకు వెళ్లి మీకు ప్రభుత్వం పలానా పనిచేసింది ప్రభుత్వం మీకు ఎంత ఆదాయం లభించిందని గర్వంగా చెప్పుకునే వాళ్లమని తెలిపారు . గతంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని నేడు విద్యా వ్యవస్థను మొత్తం భ్రష్టు పట్టించిన పరిస్థితి ప్రభుత్వం మరలా కార్పొరేట్ సంస్థలు లబ్ది చెందే విధంగా అడుగులు వేస్తున్నాయని విమర్శించారు.. ఈ బిమిలీ నియోజకవర్గ సమయకర్తగా నేను ఎప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని కార్యకర్తలు శ్రేయస్సు కోసమే పని చేస్తానని తెలియజేశారు. అనంతరం ఈ నెల 12వ తేదీన జరగబోయే వైయస్ఆర్ సీపీ "ఫీజుపోరు" పోస్టర్ ను ఫీజుపోరు" పోస్టర్ ను ఆవిష్కరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ప్రభుత్వం చేస్తున్న మోసంపై గళం విప్పుదాం రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైంది. ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లోనూ సరైన కేటాయింపులు చేయలేదు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేశారు..'యువత పోరు'లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి .శ్రీనివాసరావు, జెడ్ పి టీ సీ కోరాడ వెంకటరావు, మండల అధ్యక్షులు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీలు శ్రీను ,రామకృష్ణ, భీమిలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి మండల పార్టీ ప్రెసిడెంట్ లు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, కార్పొరేటర్లు, ఆనందపురం మండలం ఎంపీటీసీలు,సర్పంచులు, వివిధ వాడాల్లో ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్ అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గం కు చెందిన దుర్గారావు కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ. 41048/- చెక్ ను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా బాధిత కుంటుంబానికి సహాయం అందించి వారికీ చేయూత నివ్వడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని పేర్కొన్నారు. ప్రతి కష్టంలో తోడుగా వుంటానని వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వార్డ్ అధ్యక్షులు, వీర మహిళలు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు. అనారోగ్యం తో ఇంటివద్ద చికిత్స పొందుతున్న 37 వార్డ్ రెల్లివీధి కి చెందిన కోబ్రా రాజు ను ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. రాజు ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమవంతు సహాయ సహకారాలు వుంటాయని, మెరుగైన చికిత్స కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానిక నేతలకు తెలిపారు. సదరన్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. మూడు రోజులు పాటు జరిగిన స్పోర్ట్స్ మీట్లో క్రికెట్, బ్యాట్మెంటన్ వంటి పలు క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం డి సతీష్ పొన్నం విద్యార్థులను ప్రోత్సహించుటకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. గెలుపు ,ఓటములు సహజం అని ప్రతి ఒక్కరిలో పోరాట ప్రతిమ వుండాలని అన్నారు.

12న యువత పోరు

-పోస్టర్ రిలీజ్ చేసిన మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: 12వ తేదీన "యువత పోరు" పేరున ధర్నా నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమం పోస్టర్ ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూగతంలో వైఎస్ఆర్సీపీ చేపట్టిన రైతు పోరు బాట, విద్యుత్ చార్జీలు నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు. అదే తరహాలో ఈ నెల 12న నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని జిల్లా కేంద్రాల్లో యువత తరుపున వైఎస్ఆర్సీపీ పోరాటం చేస్తుందన్నారు. నాడు విద్యార్థుల భవిష్యత్ కోసం ఫీజ్ రియంబర్స్ మెంట్ పథకాన్ని దివంగత వైఎస్ఆర్ ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4000 కోట్లు బకాయిలు పెట్టిందని చెప్పారు. నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అటువైపు చూడలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రవేటికరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మూడు అంశాలపై యువత పోరు కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, యువత జయప్రదం చేయాలని ఆయన కోరారు.